ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

# మన ప్రజాప్రతినిధి

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

తెలుగు దిన పత్రిక


ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :182 సోమవారం ఏప్రిల్ 27 2026, పేజీలు - 4 వేల : 2/-

epaper.manaprajaprathinidhi.com

PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH


# హుజూర్ నగర్ గడ్డ పై...

# గులాబీ జోష్



- •కేటీఆర్ సమక్షంలో పిల్లుట్ల రఘు బీఆర్ఎస్ పార్టీలో చేరారు
- •పార్టీ బలోపేతంపై కేటీఆర్ ధీమా
- •తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్‌లో చేరికలు
- •హుజూర్‌నగర్ నేత పిల్లుట్ల రఘు గులాబీ గూటికి
- •కాంగ్రెస్‌పై విమర్శల వర్షం



హైదరాబాద్, ఏప్రిల్ 26 (మనప్రజాప్రతినిధి): తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో హుజూర్‌నగర్‌కు చెందిన నాయకుడు పిల్లుట్ల రఘు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ 2023 సాధారణ ఎన్నికలతో పోలిస్తే ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బలం మరింత పెరిగిందని అన్నారు. పార్టీ స్థాపన నుంచి 25 ఏళ్ల ప్రయాణం పూర్తి చేసుకున్న నేపథ్యంలో పార్టీ మరింత శక్తివంతంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. స్వర్గీయ కొండా లక్ష్మణ్ బాపూజీ ఇంటి నుంచి ప్రారంభమైన బీఆర్ఎస్ ప్రయాణం రాష్ట్ర రాజకీయాల్లో కీలక మార్పులకు దారితీసిందని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి దిశగా పెద్దఎత్తున కార్యక్రమాలు అమలయ్యాయని అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనపై తీవ్ర విమర్శలు చేసిన కేటీఆర్, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు కాలేదని ఆరోపించారు. ఆరు గ్యారంటీలు, పలు డిక్లరేషన్లు అమలులోకి రాలేదని ప్రశ్నించారు.నల్గొండ జిల్లాలో కాంగ్రెస్ పాలనలో ఎదురైన సమస్యలను ప్రస్తావిస్తూ ఫ్లోరోసిస్ సమస్య, నీటి కొరత వంటి అంశాలను గుర్తుచేశారు. కేసీఆర్ పాలనలో మిషన్ భగీరథ వంటి పథకాల ద్వారా సమస్యలకు పరిష్కారం చూపినట్లు తెలిపారు.అలాగే యాదాద్రి అభివృద్ధి, మెడికల్ కాలేజీలు, అల్ట్రా మెగా పవర్ ప్రాజెక్ట్ వంటి కార్యక్రమాలను ప్రస్తావిస్తూ అభివృద్ధి దిశగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేసిందని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలని కేటీఆర్ అన్నారు. కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసేందుకు ప్రజలు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.

ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

# మన ప్రజాప్రతినిధి

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

తెలుగు దిన పత్రిక

ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :182 సోమవారం ఏప్రిల్ 27 2026, పేజీలు - 4 వేల : 2/-

epaper.manaprajaprathinidhi.com

PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH

## కనిపించని ముప్పు...

○డిజిటల్ స్క్రీన్ టైమ్ పెరుగుదల

○రోజుకు గంటలు కాదుడ జీవితమే స్క్రీన్‌లో బంధం

○కంటి నుంచి మెదడు వరకు ఆరోగ్యంపై గంభీర ప్రభావం





ఏప్రిల్ 26 (మనప్రజాప్రతినిధి): ఆధునిక జీవితంలో డిజిటల్ పరికరాలు అనివార్యంగా మారాయి. స్మార్ట్‌ఫోన్, కంప్యూటర్, టాబ్లెట్ లేకుండా రోజు గడవడం కష్టంగా మారింది. అయితే ఈ సౌకర్యం మితిమీరిన వినియోగంగా మారి ఇప్పుడు ఆరోగ్యానికి పెద్ద ప్రమాదంగా రూపాంతరం చెందుతోంది. ఉదయం లేవగానే మొబైల్ చూస్తూ ప్రారంభమయ్యే రోజు, రాత్రి నిద్రపోయే వరకు స్క్రీన్‌తోనే ముగుస్తోంది. ఈ అలవాటు మన జీవనశైలిని పూర్తిగా మార్చేస్తోంది. అధిక స్క్రీన్ టైమ్ వల్ల మొదటగా ప్రభావం పడేది కళ్లపైనే. గంటల తరబడి స్క్రీన్ చూడటం వల్ల కంటి నొప్పి, పొడిబారడం, మసక దృష్టి వంటి సమస్యలు పెరుగుతున్నాయి. దీర్ఘకాలంలో కంటి చూపు తగ్గే ప్రమాదం కూడా ఉంది. ముఖ్యంగా రాత్రి సమయంలో మొబైల్ వినియోగం ఎక్కువైతే నిద్ర హార్మోన్‌పై ప్రభావం పడుతూ నిద్రలేమి సమస్య తీవ్రంగా మారుతోంది. సరైన నిద్ర లేకపోవడం వల్ల శరీరం అలసటతో బాధపడుతుంది. మానసిక ఆరోగ్యంపై స్క్రీన్ టైమ్ ప్రభావం మరింత గంభీరంగా మారుతోంది. సోషల్ మీడియా ద్వారా నిరంతరం ఇతరుల జీవితాలతో పోల్చుకోవడం, లైక్స్, కామెంట్స్ కోసం ఆత్రుత పెరగడం యువతలో ఒత్తిడి, ఆందోళనకు దారి తీస్తోంది. డిజిటల్ ప్రపంచంలో మునిగిపోయి వాస్తవ జీవితానికి దూరమవడం వల్ల ఒంటరితనం పెరుగుతోంది. ఇది డిప్రెషన్ వంటి సమస్యలకు కారణమవుతోంది.పిల్లల విషయంలో పరిస్థితి ఇంకా ఆందోళనకరం. బయట ఆడుకోవాల్సిన వయసులో వారు గేమ్స్, వీడియోలతో కాలక్షేపం చేస్తున్నారు. శారీరక చలనం తగ్గిపోవడంతో స్థూలకాయం, శారీరక బలహీనత వంటి సమస్యలు పెరుగుతున్నాయి. అదేవిధంగా చదువుపై దృష్టి తగ్గి, ఏకాగ్రత లోపం ఏర్పడుతోంది. కుటుంబ సభ్యులతో మాట్లాడే సమయం కూడా తగ్గిపోవడం భావోద్వేగ సంబంధాలను బలహీనపరుస్తోంది. డిజిటల్ స్క్రీన్ టైమ్ పెరగడం వల్ల శరీర భంగిమ కూడా దెబ్బతింటోంది. గంటల తరబడి మొబైల్ లేదా ల్యాప్‌టాప్ ముందు కూర్చోవడం వల్ల మెడ నొప్పి, వెన్నునొప్పి వంటి సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇది భవిష్యత్తులో తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారి తీసే అవకాశం ఉంది. ముఖ్యంగా ఉద్యోగాల కారణంగా రోజంతా కంప్యూటర్ ముందు కూర్చోవాల్సినవారికి ఇది పెద్ద సమస్యగా మారుతోంది. ఈ పరిస్థితిని నియంత్రించడం అత్యవసరం. రోజువారీగా స్క్రీన్ టైమ్‌కు పరిమితి విధించాలి. ప్రతి గంటకు కొంత విరామం తీసుకోవడం, కళ్లకు విశ్రాంతి ఇవ్వడం అవసరం. పిల్లలకు గాడ్జెట్ల వినియోగంపై నియంత్రణ పెట్టడం, బయట ఆటలు ప్రోత్సహించడం తల్లిదండ్రుల బాధ్యత. అలాగే నిద్రకు ముందు కనీసం ఒక గంట స్క్రీన్ దూరంగా ఉండటం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. మొత్తానికి డిజిటల్ సాంకేతికత మన జీవితాన్ని సులభతరం చేసినప్పటికీ, దాని అధిక వినియోగం ప్రమాదాలను కూడా తెస్తోంది. సమతుల్యతతో వినియోగం చేయడం ద్వారానే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. స్క్రీన్‌పై ఆధారపడే జీవితం కాకుండా, నియంత్రిత వినియోగం ద్వారా సమగ్ర ఆరోగ్యాన్ని సాధించడం సమయానుకూలమైన అవసరం.

## రాష్ట్రవ్యాప్తంగా జెండా ఎగురవేతకు పిలుపు

● బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం కు పిలుపు

● ప్రతి గ్రామం నుంచి జిల్లా కేంద్రం వరకు వేడుకలు

● తెలంగాణ భవన్‌లో రాష్ట్ర స్థాయి సమావేశం

● ప్లీనరీకి బదులుగా పరిమిత కార్యవర్గ భేటీ

●కేటీఆర్



హైదరాబాద్, ఏప్రిల్ 26 (మనప్రజాప్రతినిధి): బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం, పట్టణం, నియోజకవర్గం, జిల్లా కేంద్రాల్లో పార్టీ జెండాలను ఎగురవేసి వేడుకలను నిర్వహించాలని సూచించారు.ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన తారక రామారావు, కార్యక్రమాల నిర్వహణపై స్పష్టమైన దిశానిర్దేశం ఇచ్చారు. స్థానిక స్థాయిలో అన్ని ప్రాంతాల్లో సమన్వయంతో వేడుకలను జరపాలని సూచించారు.రేపు ఏప్రిల్ 27న తెలంగాణ భవన్‌లో రాష్ట్ర స్థాయి ప్రతినిధుల సమావేశం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశం ద్వారా పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.ఇటీవల జగిత్యాలలో భారీ బహిరంగ సభ నిర్వహించిన నేపథ్యంలో, ప్రస్తుత ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఆదేశాల మేరకు ఈసారి ప్లీనరీ సమావేశాన్ని పరిమితంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధ్యక్షులతో పాటు మాజీ ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లకు మాత్రమే ఆహ్వానం ఉందని పార్టీ తెలిపింది. తెలంగాణ భవన్‌లో పరిమిత సంఖ్యలోనే ప్రవేశం ఉంటుందని స్పష్టం చేసింది.ఆహ్వానం లేని నాయకులు, కార్యకర్తలు తమ తమ ప్రాంతాల్లోనే ఉండి ఉదయం జెండా ఆవిష్కరణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని, దూర ప్రాంతాల నుండి వచ్చే ప్రతినిధులు మధ్యాహ్నం ఒకటిన్నర గంటల కల్లా హైదరాబాద్ చేరుకోవాలని తారక రామారావు సూచించారు.

## కర్ణాటకలో జనసేన విస్తరణ వేగం


- చిత్రదుర్గలో నాయకుల చేరికలు
- నాగబాబు, రామ్ తాళ్లూరి సమక్షంలో కార్యక్రమం
- పార్టీ బలోపేతం లక్ష్యంగా అడుగులు

చిత్రదుర్గ, ఏప్రిల్ 26 (మనప్రజాప్రతినిధి): కర్ణాటక రాష్ట్రంలో జనసేన పార్టీ విస్తరణకు వేగం పెరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ ప్రాభవాన్ని పెంచే దిశగా చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా చిత్రదుర్గలో పలువురు నాయకులు, కార్యకర్తలు జనసేనలో చేరారు. ఈ చేరికల కార్యక్రమంలో శాసన మండలి సభ్యుడు నాగబాబు, పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి పాల్గొని కొత్తగా చేరిన వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా జరిగింది.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కర్ణాటకలో కూడా జనసేన పార్టీని బలపర్చడం లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. స్థానిక సమస్యలను గుర్తించి ప్రజలతో కలిసి ముందుకు సాగాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీలో చేరిన నాయకులు జనసేన సిద్ధాంతాలకు ఆకర్షితులై ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రజల సేవే లక్ష్యంగా పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటామని చెప్పారు.కర్ణాటకలో పార్టీ విస్తరణకు ఈ చేరికలు కీలకమవుతాయని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. భవిష్యత్తులో మరిన్ని ప్రాంతాల్లో కూడా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సమాచారం. ఈ పరిణామాలు కర్ణాటక రాజకీయాల్లో కొత్త మార్పులకు దారి తీసే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



## పెట్రోల్, డీజిల్ కొరతపై సీఎం సమీక్ష

- సరఫరా పెంపు చర్యలు వేగవంతం
- డిమాండ్ ఒక్కసారిగా పెరగడంతో బంకుల్లో రద్దీ
- సరఫరా పెరిగిందని అధికారుల వివరణ
- ప్యానిక్ కొనుగోళ్లే సమస్యకు కారణమని అంచనా



అమరావతి, ఏప్రిల్ 26 (మన ప్రజాప్రతినిధి): రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరతపై ఏర్పడిన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. వీడియో మాధ్యమం ద్వారా నిర్వహించిన ఈ సమావేశంలో ఇంధన సరఫరా, వినియోగ పరిస్థితులు, డిమాండ్ పెరుగుదలపై సమగ్రంగా చర్చించారు. అధికారులు సీఎంకు నివేదిస్తూ గతంతో పోలిస్తే ప్రస్తుతం ఇంధన సరఫరా గణనీయంగా పెరిగిందని తెలిపారు. శనివారం రోజున మాత్రమే పెట్రో లియం సంస్థలు 10,345 కిలో లీటర్ల పెట్రోల్, 14,156 కిలో లీటర్ల డీజిల్ డీలర్లకు సరఫరా చేసినట్లు వివరిం చారు. సరఫరాలో ఎలాంటి అంత రాయం లేదని స్పష్టం చేశారు.అయితే కొరత ఉందనే వార్తలతో ప్రజల్లో ఆందోళన పెరగడం వల్ల ప్యానిక్ కొనుగోళ్లు పెరిగాయని అధికారులు తెలిపారు. సాధారణ రోజుల్లో ఉండే వినియోగానికి మించి ఒక్కసారిగా కొనుగోళు పెరగడం వల్ల కొన్ని ప్రాంతాల్లో బంకుల వద్ద రద్దీ ఏర్పడినట్లు చెప్పారు. సాధారణంగా రోజుకు సుమారు 6,330 కిలో లీటర్ల పెట్రోల్, 9,048 కిలో లీటర్ల డీజిల్ అమ్మకాలు జరుగుతాయని అధికారులు పేర్కొన్నారు. అయితే ఇటీవల పరిస్థితుల్లో శనివారం ఒక్కరోజే 8,489 కిలో లీటర్ల పెట్రోల్, 10,556 కిలో లీటర్ల డీజిల్ అమ్మకం జరిగినట్లు తెలిపారు. ఇది డిమాండ్ పెరుగుదల స్పష్టంగా చూపిస్తుందని చెప్పారు. ప్రజల్లో ఉన్న అపోహలను తొలగిం చేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సీఎం సూచించారు. సరఫరా తగినంతగా ఉన్నప్పటికీ అన వసరంగా నిల్వ చేసుకోవద్దని ప్రజలకు తెలియజేయాలని ఆదేశించారు. ప్రతి పెట్రోల్ బంక్ వద్ద సరఫరా సజావుగా కొనసాగేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖలు తీసుకున్న చర్యలు, సమస్య పరిష్కారానికి తీసుకుంటున్న నిర్ణయాలపై తక్షణ నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు వేగంగా అమలు చేయాలని సూచించారు.ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని అధికారులు తెలిపారు. పరిస్థితి త్వరలోనే సాధారణ స్థితికి చేరుతుందని వారు విశ్వాసం వ్యక్తం చేశారు

## జర్నలిస్టుల సంక్షేమంపై శ్రీనివాస్ గౌడ్ కీలక వ్యాఖ్యలు



- అక్రిడేషన్ కార్డులపై సమానత్వం అవసరం
- జర్నలిస్టులకు హెల్త్ సదుపాయాల ప్రాధాన్యం
- డబుల్ బెడ్ రూమ్ హామీపై స్పష్టత

మహబూబ్ నగర్, ఏప్రిల్ 26 (మనప్రజాప్రతినిధి): మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని క్రౌన్ గార్డెన్‌లో మహబూబ్ నగర్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. సమావేశంలో జర్నలిస్టుల సమస్యలు, సంక్షేమ అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది.ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డు జారీ చేయాలని పేర్కొన్నారు. చిన్న పత్రికలు, పెద్ద పత్రికలు అనే తేడా చూపకుండా అందరికీ సమాన అవకాశాలు కల్పించాలని సూచించారు.బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో అక్రిడేషన్ కార్డులతో పాటు జర్నలిస్టులకు హెల్త్ కార్డులు అందించిన విషయాన్ని గుర్తు చేశారు. జర్నలిస్టుల కుటుంబ సభ్యులకు ఉచిత వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకున్నామని వివరించారు.ప్రస్తుతం అనేక జర్నలిస్టు కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను వెలికి తీయడంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమని, సమాజానికి వారు చేస్తున్న సేవను గుర్తించాల్సిన అవసరం ఉందని చెప్పారు.తమ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో చాలా మంది జర్నలిస్టులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అందించినట్లు తెలిపారు. ఇంకా కొందరికి ఇవ్వాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం మారడం వల్ల అది సాధ్యం కాలేదని పేర్కొన్నారు. మళ్ళీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి జర్నలిస్టుకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అందించేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రస్తుతం ఉన్న పాలకులను కూడా ఈ అంశంపై ఐక్యంగా నిలబడి డిమాండ్ చేయాలని జర్నలిస్టులకు పిలుపునిచ్చారు.



# టోల్‌ప్లాజా ఘటనపై సీఎం ఆగ్రహం

- కఠిన చర్యలకు ఆదేశాలు
- సిబ్బందిపై దాడిపై తీవ్ర స్పందన
- బాధ్యులపై కేసులు నమోదు చేయాలని ఆదేశం
- చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే సహించమని హెచ్చరిక



అమరావతి, ఏప్రిల్ 26 (మనప్రజాప్రతినిధి): అన్నమయ్య జిల్లాలో టోల్‌ప్లాజా సిబ్బందిపై జరిగిన దాడి ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఈ ఘటనలో బాధ్యులపై వెంటనే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులను సీఎం ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినంగా వ్యవహరించాలని సూచించారు.వివరాల ప్రకారం కల్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తన అనుచరులతో కలిసి తిరుమల దర్శనం ముగించుకుని తిరుగు ప్రయాణంలో ఉన్నారు. ఈ క్రమంలో మదనపల్లెతిరుపతి జాతీయ రహదారిపై గండబోయినపల్లె టోల్‌గేట్ వద్దకు చేరుకున్నారు. టోల్ సిబ్బంది వాహనాన్ని గుర్తించినప్పటికీ ఫీజు చెల్లించాలని కోరడంతో వివాదం చోటుచేసుకుంది. దీంతో ఉద్రిక్తత నెలకొని వాగ్వాదం పెరిగింది.ఆగ్రహానికి లోనైన అనుచరులు, గన్‌మన్ టోల్‌ప్లాజా సిబ్బందిపై దాడికి దిగినట్లు సమాచారం. టోల్ బ్యారియర్‌ను ధ్వంసం చేయడం తో పాటు మేనేజర్ రవి, మహిళా ఉద్యోగి శ్రీలతపై దాడి జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనలో మహిళపై దాడి జరిగిన దృశ్యాలు సీసీటీవీలో రికార్డ్ అయినట్లు వెల్లడించారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

# జనగణన2027కు శ్రీకారం

- స్వీయ గణనలో సీఎం రేవంత్ రెడ్డి
- ఆన్‌లైన్ స్వీయ నమోదు ప్రారంభం
- ప్రజల భాగస్వామ్యంతో ఖచ్చితమైన జనాభా లెక్కలు లక్ష్యం
- డిజిటల్ తెలంగాణ దిశగా మరో కీలక అడుగు



హైదరాబాద్, ఏప్రిల్ 26 (మనప్రజాప్రతినిధి): దేశవ్యాప్తంగా చేపట్టనున్న జనగణన2027లో భాగంగా తెలంగాణలో స్వీయ గణన ప్రక్రియను అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా సెల్ఫ్ ఎన్యుమరేషన్‌లో పాల్గొని తమ కుటుంబ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి నాంది పలికారు. దీంతో రాష్ట్రంలో ఈ ప్రక్రియకు విస్తృత స్థాయిలో ప్రచారం లభించింది.అధికారిక వెబ్ పోర్టల్ ద్వారా ముఖ్యమంత్రి స్వీయ నమోదు పూర్తి చేసి ప్రజలకు ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబం తమ వివరాలను ఖచ్చితంగా నమోదు చేయడం ద్వారా సరైన జనాభా లెక్కలు సాధ్యమవుతాయని తెలిపారు. జనగణన విజయవంతం కావడానికి ప్రజల సక్రియ భాగస్వామ్యం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. జనగణనలో భాగంగా తొలిసారిగా ప్రవేశపెట్టిన స్వీయ గణన విధానం ప్రజలకు సులభతరం చేయబడిందని అధికారులు వివరించారు. మొబైల్ నంబర్, ఓటీపీ ధృవీకరణ ఆధారంగా ప్రజలు సురక్షితంగా తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. కుటుంబ సభ్యుల వివరాలు, నివాస సమాచారం, సౌకర్యాలు వంటి అంశాలను సమగ్రంగా నమోదు చేసే అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా సెన్సస్ అధికారులు స్వీయ గణన ప్రక్రియపై ముఖ్యమంత్రికి సమగ్ర వివరణ అందించారు. డిజిటల్ మ్యాపింగ్ ద్వారా నివాస స్థలాన్ని ఖచ్చితంగా గుర్తించడం ముఖ్యమని సూచించారు. నమోదు అనంతరం ప్రత్యేక ఎస్‌ఈ ఐడీ జారీ అవుతుందని, తద్వారా డేటా ధృవీకరణ సులభమవుతుందని వివరించారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్ భారతి హోళికేరి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, జాయింట్ ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ ప్రియాంక, సమాచార శాఖ కమిషనర్ సీహెచ్ ప్రియాంక తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కార్యక్రమం అధికారికంగా ప్రారంభమైన సందర్భంగా అధికారులు ప్రజలకు అవసరమైన మార్గదర్శకాలు అందించారు. ప్రతి కుటుంబం తాము నివసిస్తున్న ప్రదేశంలోనే వివరాలను నమోదు చేయాలని, లొకేషన్ మ్యాపింగ్ ఖచ్చితంగా చేయాలని అధికారులు సూచించారు. ఒక మొబైల్ నంబర్‌తో ఒకే కుటుంబం నమోదు చేయాలని, తుది సమర్పణకు ముందు వివరాలను జాగ్రత్తగా పరిశీలించాలని చెప్పారు.స్వీయ గణన చేసినప్పటికీ ఎన్యూమరేటర్ గృహ సందర్శన కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేశారు. ఎస్‌ఈ ఐడీ ఆధారంగా వివరాలు ధృవీకరించి అవసరమైతే సవరణలు చేస్తారని తెలిపారు. ఈ విధానం ద్వారా ఖచ్చితమైన జనాభా డేటా సేకరణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. డిజిటల్ విధానాలను వినియోగిస్తూ పారదర్శక పరిపాలనను బలోపేతం చేసే దిశగా జనగణన2027 ఒక కీలక మైలురాయిగా నిలవనుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికార యంత్రాంగం కోరింది.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... చిత్రపటానికి పాలాభిషేకం

మన ప్రజాప్రతినిధి దినపత్రిక,చేర్యాల, జనగామ నియోజకవర్గం :జనగామ నియోజకవర్గం.చేర్యాల పట్టణ కేంద్రంలోని ఆర్యవైశ్య భవన్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతిని తెలంగాణ రాష్ట్ర వేడుకగా ప్రకటించినందుకు ముఖ్యమంత్రి గౌరవ అనుముల రేవంత్ రెడ్డి కి చేర్యాల పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ గుప్త,ఆధ్వర్యంలో పాలాబిషేకం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర,జిల్లా, మండల మరియు పట్టణ ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.



# ప్రజావాణి సేవల విస్తరణకు సీఎం ఆదేశాలు

- అర్జీల పరిష్కార వ్యవస్థకు పకడ్బందీ అమలు
- రెవెన్యూ డివిజన్ నుంచి మండల స్థాయి వరకు విస్తరణ
- డిజిటల్ ట్రాకింగ్‌తో వేగవంత పరిష్కారం లక్ష్యం



హైదరాబాద్, ఏప్రిల్ 26 (మనప్రజాప్రతినిధి): రాష్ట్రంలో ప్రజల అర్జీలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పటిష్టంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణి సేవలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లి ప్రజలకు మరింత చేరువ చేయాలని సూచించారు.ప్రజా ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన వెంటనే 2023 డిసెంబర్ 8న ప్రారంభించిన ప్రజావాణి కార్యక్రమం అప్పటి నుంచి నిరంతరం కొనసాగుతోంది. ప్రతి మంగళవారం, శుక్రవారం మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజాభవన్‌లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే అర్జీలను అధికారులు స్వీకరిస్తూ పరిష్కార చర్యలు చేపడుతున్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో కూడా ప్రజావాణి నిర్వహణ జరుగుతోంది. ప్రజలు ఇచ్చే ఫిర్యాదులను సంబంధిత విభాగాలకు పంపించి వేగంగా పరిష్కరించే చర్యలు కొనసాగుతున్నాయి.దూర ప్రాంతాల ప్రజలు హైదరాబాద్‌కు రావాల్సిన అవసరం లేకుండా రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. తరువాత దశలో మండల స్థాయికి కూడా ఈ సేవలను విస్తరించాలని సూచించారు. ప్రజావాణిలో అందిన ప్రతి అర్జీ నమోదు కావాలని, దాని పరిష్కార పురోగతిని అర్జీదారునికి తెలియజేయాలని సీఎం స్పష్టం చేశారు. ఫిర్యాదుల పరిష్కారానికి గడువులు నిర్దేశించి ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఫిర్యాదుల నమోదు, ట్రాకింగ్, పరిష్కారానికి ఒకే డిజిటల్ ప్లాట్‌ఫాం అభివృద్ధి చేయాలని సూచించారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో రియల్ టైమ్ మానిటరింగ్ ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి స్థాయిలో ప్రజావాణికి నోడల్ అధికారులను నియమించాలని, ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. ఒక స్థాయిలో పరిష్కారం కాని సమస్యలు పై స్థాయికి చేరేలా ఆటో ఎస్కలేషన్ విధానం అమలు చేయాలని సూచించారు.ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, పెండింగ్ అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం స్పష్టం చేశారు. డ్యాష్‌బోర్డ్ ద్వారా పనితీరును పర్యవేక్షించి ఆలస్యం జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజావాణి సేవల వికేంద్రీకరణతో కిందిస్థాయిలోనే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని, ప్రజలకు నమ్మకంగా ఉండే సేవలు అందించడమే లక్ష్యమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

# ఆరోగ్యకర జీవనశైలిపై చైతన్య సందేశం

- ఓరల్ క్యాన్సర్ అవేర్‌నెస్ రన్‌లో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు
- సత్వ నాలెడ్జ్ పార్క్‌లో ఉత్సాహభరిత కార్యక్రమం
- నిర్వాహకులకు అభినందనలు తెలిపిన రామచందర్ రావు




హైదరాబాద్, ఏప్రిల్ 26 (మనప్రజాప్రతినిధి): నగరంలోని సత్వ నాలెడ్జ్ పార్క్‌లో నిర్వహించిన 'ఓరల్ క్యాన్సర్ అవేర్‌నెస్ రన్' కార్యక్రమంలో తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రజల ఉత్సాహం ప్రత్యేకంగా ఆకట్టుకుంది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరుసగా రెండవ సంవత్సరం ఈ కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనడం సమాజంలో ఆరోగ్యంపై అవగాహన పెరుగుతున్న సంకేతమని తెలిపారు. నోటి క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా ప్రాణాలను రక్షించవచ్చని రామచందర్ రావు పేర్కొన్నారు. సకాలంలో చికిత్స అందించడం అత్యంత ముఖ్యమని అన్నారు.ఆరోగ్యకర జీవనశైలిని అలవరచుకోవడం ద్వారా అనేక వ్యాధులను దూరంగా ఉంచుకోవచ్చని ఆయన సూచించారు. ప్రజల్లో అవగాహన పెంచే ఇలాంటి కార్యక్రమాలు మరింత అవసరమని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన గ్లోబల్ ఓరల్ క్యాన్సర్ ట్రస్ట్ నిర్వాహకులకు ఆయన అభినందనలు తెలిపారు. సమాజం మొత్తాన్ని ఒక లక్ష్యంతో ఏకతాటిపైకి తీసుకురావడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో యువత, ప్రజలు పాల్గొని ఆరోగ్యంపై చైతన్య సందేశాన్ని విస్తరించారు. సమాజంలో ఆరోగ్య సంరక్షణకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు.



# జిల్లా కలెక్టర్‌గా భవేష్ మిశ్రా బాధ్యతలు స్వీకరణ

- కలెక్టరేట్‌లో బాధ్యతలు చేపట్టిన కొత్త అధికారి
- పూర్వ కలెక్టర్ అభిలాష స్వాగతం
- పాలనలో కొత్త దిశకు శ్రీకారం



నిర్మల్, ఏప్రిల్ 26 (మనప్రజాప్రతినిధి): నిర్మల్ జిల్లాకు కలెక్టర్‌గా భవేష్ మిశ్రా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో అధికారికంగా పదవీ బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా పూర్వ జిల్లా కలెక్టర్ అభిలాష కొత్త కలెక్టర్‌ను పుష్పగుచ్ఛంతో ఆహ్వానించారు. బాధ్యతల బదిలీ కార్యక్రమం సాదాసీదాగా జరిగింది. భవేష్ మిశ్రా జిల్లా పరిపాలనను సమర్థంగా ముందుకు తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. ప్రజలకు పారదర్శక సేవలు అందించడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.పూర్వ కలెక్టర్ అభిలాష తన పదవీకాలంలో అందించిన సేవలను గుర్తుచేసుకుంటూ కొత్త అధికారికి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని సూచించారు.జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. కలెక్టరేట్ సిబ్బంది ఈ సందర్భంగా కొత్త కలెక్టర్‌కు స్వాగతం పలికి సహకారం అందించేందుకు సిద్ధమని తెలిపారు. జిల్లా పాలనలో సమన్వయం కొనసాగుతుందని భావిస్తున్నారు.



# పేదవాడికి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

**పేదల కోసమే ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్**



మనప్రజాప్రతినిధి//మద్దూరు, జనగామ :జనగాం నియోజక వర్గం.మద్దూరు మండలం, లద్నూర్ గ్రామ నిరుపేద దళిత సామాజిక వర్గానికి చెందిన పాకాల వినీత్ వా/రా ఇసాక్ రోడ్డు ప్రమాదంలో కాలికి గాయం కాగా సర్జరీకి పెద్ద మొత్తంలో డబ్బులు అవసరం కాగా ఈ విషయాన్ని స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్,వద్దకు తీసుకెళ్లగా వెంటనే బీసీ సంక్షేమ శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్, తక్షణం స్పందించి (1,00,000)లక్ష రూపాయల ఎల్ ఓ సి,మంజూరు చేయించడం జరిగింది.ఇట్టి మంజూరు పత్రాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్ కుమార్ బాధిత కుటుంబానికి వారి గ్రామంలో అందజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పూల కనకయ్య,గ్రామ కాంగ్రెస్ కార్యదర్శి కూరెల్ల మల్లేశం,జిల్లా కాంగ్రెస్ నాయకులు దాసరి రఘువీర పద్మా రెడ్డి,మండల నాయకులు పులగం మల్లికార్జున్,మాజీ సర్పంచ్ జీడి కంటి సురేష్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దాసరి శ్రీనివాస్ రెడ్డి,భోగి శ్రీనివాస్,కర్రెరామచంద్రం,తాడూరుసిద్ధిరాములు,మల్లారపు రాజు,మల్లారపు నర్సయ్య,నంద బుచ్చయ్య,మరాటి అయిలిమల్లు, తదితరులు పాల్గొన్నారు

# నెంబర్ ప్లేట్లు లేని వాహనాల సంచారం



దౌల్తాబాద్ మనప్రజాప్రతినిధి//ఏప్రిల్ 26):సిద్ధిపేట జిల్లా దౌల్తాబాద్ మండల కేంద్రంలో నెంబర్ ప్లేట్లు లేకుండా సంచరిస్తున్న వాహనాల సమస్య తీవ్రంగా మారుతోంది. ముందువైపు, వెనుక వైపు నెంబర్ ప్లేట్లు లేకుండా అనేక వాహనాలు నిర్భయంగా తిరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నప్పటికీ, అధికారుల చర్యలు సరైన స్థాయిలో లేవని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ప్రత్యేకంగా, శాశ్వత రిజిస్ట్రేషన్ నెంబర్ ప్లేట్లు పొందిన వాహనాలు కూడా వాటిని అమర్చకుండా తిరగడం గమనార్హం. మరికొన్ని వాహనాలు తాత్కాలిక "ए=" నెంబర్‌తోనే నెలల తరబడి రోడ్లపై సంచరిస్తున్నాయి. నిబంధనల ప్రకారం తాత్కాలిక రిజిస్ట్రేషన్ కొద్దికాలం మాత్రమే చెల్లుబాటు అవుతుంది. అయినప్పటికీ, వాహనదారులు దీనిని పట్టించుకోకపోవడం ఆందోళన కలిగిస్తోంది.నెంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు తిరగడం అంతరాయం కలగడమే కాకుండా, ప్రమాదాలు లేదా నేరాల సమయంలో వాహనాలను గుర్తించడం కష్టసాధ్యమవుతోంది. ఇది ప్రజల భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. సంబంధిత శాఖలు కఠిన చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. పోలీసులు, రవాణా శాఖ కలిసి ప్రత్యేక తనిఖీలు నిర్వహించి నెంబర్ ప్లేట్లు లేని వాహనాలపై జరిమానాలు విధించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి నియమాలను కచ్చితంగా అమలు చేస్తే, రోడ్డు భద్రత మెరుగుపడుతుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# బిజెర్ నగర్ శ్రీరామ క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్:జవహర్ నగర్ డివిజన్ పరిధిలోని బిజెర్ నగర్‌లో శ్రీరామ క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించబడింది.ఈ వైద్య శిబిరంలో పేద ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందించారు. నిపుణులైన వైద్యులు ప్రజలకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, తగిన జాగ్రత్తలు మరియు సూచనలు చేశారు. శిబిరంలో ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను కూడా పంపిణీ చేశారు. సుమారు 200 మంది స్థానిక ప్రజలు ఈ శిబిరం ద్వారా లబ్ధి పొందారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్,స్థానిక మాజీ కార్పొరేటర్లు పల్లపు రవి,బింగి లావణ్య సతీష్ గౌడ్ ,రెడ్డి శెట్టి మహేష్ , హాజరయ్యారు.వారితో పాటు శ్రీరామ క్లినిక్ ఆస్పత్రి సిబ్బంది, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ప్రజారోగ్యమే లక్ష్యంగా శ్రీరామ క్లినిక్ నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజాప్రతినిధులు, స్థానికులు అభినందించారు.

# ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు



మనప్రజాప్రతినిధి//జనగామ నియోజకవర్గం:చేర్యాల మండలం,కమలయపల్లి గ్రామంలో అక్రమ రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్న చేర్యాల ఎస్సై అపూర్వ రెడ్డి. వివరాల్లోకి వెళితే కమలాయపల్లి గ్రామంలో ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్న వారిని చేర్యాల ఎస్సై ఆపి ఇసుక తరలింపునకు అనుమతి పత్రాలు అడగగా వారి వద్ద ఎలాంటి పెట్టుకొని అనుమతి పత్రాలు లేవని తెలపడంతో అట్టి ఇసుకను అక్రమంగా తరలిస్తుండటంతో రెండు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని చేర్యాల పోలీవీసస్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.ప్రభుత్వ అనుమతులు లేనిదే ఇసుకను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఇందిరమ్మ ఇండ్ల ను ప్రారంభించిన ఎంపీ చామల



మనప్రజాప్రతినిధి// దినపత్రిక,చేర్యాల, జనగామ:జనగామ నియోజకవర్గం.జనగామ నియోజకవర్గ పరిధిలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో భాగంగా ముఖ్యఅతిథిగా భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి,పాల్గొని,లబ్ధిదారులతో కలిసి సామూహిక గృహప్రవేశాలు చేయించి,ఇండ్లను ప్రారం భించారు.జనగామ పట్టణంలోని ఇరవై ఒకటవ వార్డుతో పాటు,కుటిగల్ గ్రామం మరియు రెడ్యా నాయక్ తండాలలో ఎంపీ చామల, పర్యటించారు.అక్కడ పూర్తయిన ఇందిరమ్మ ఇండ్లకు రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశ కార్యక్రమాలను ప్రారంభించి లబ్ధిదారులకు పట్టు వస్త్రాలను అందించారు. ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మాట్లాడుతూ పేదల సొంతింటి కల సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని,అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కడకంచి బాలమణి శ్రీనివాస్, జనగామ మున్సిపల్ చైర్మన్,కౌన్సిలర్లుఅండాలు,భరద్వాజ్,అనిత,జ్యోతి,కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్యనారాయణ, కంచరాములు,బాల్ రెడ్డి,కొండల్ రెడ్డి,వార్డు ప్రజలు మరియు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎంపీ కి ఘనస్వాగతం పలికారు.ఇండ్లు పొందిన లబ్ధిదారులు ఈ సందర్భంగా సంతోషం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ



మనప్రజాప్రతినిధి// చేర్యాల, జనగామను :జనగామ నియోజకవర్గం.చేర్యాల మున్సిపల్ పరిధిలో మూడవ వార్డు బురాన్ మీయతోట వీధిలో తుమ్మ జానకి సురేష్,ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం భూమి పూజకు హాజరైన చేర్యాల మాజీ జెడ్పీటిసి కొమ్ము నరసింగరావు,వార్డు కౌన్సిలర్ కొమ్ము రాజేశ్వరి.ఈ సందర్భంగా కొమ్ము నరసింగరావు,మాట్లాడుతూ చేర్యాల పట్టణానికి భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి,మరియు కొమ్మూరి ప్రతాపరెడ్డి,సహకారంతో పట్టణానికి పదిహేడు ఇందిరమ్మ ఇల్లు మంజూరైనవి.అదేవిధంగా రాబోయే రోజుల్లో రెండవ విడతలో పార్టీలకతీతంగా ఇల్లు లేని ప్రతి నిరుపేదలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పట్టణానికి అత్యధిక ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తామని మరియు గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి, సహకారంతో మండలానికి అత్యధిక ఇల్లు తెచ్చిన చరిత్ర ాంగ్రెస్ పార్టీదని,ఇల్లు లేని నిరుపేదలకు ఇల్లు ఇవ్వాలంటే అది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని,గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో పట్టణానికి ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయని పార్టీ, అభివృద్ధి అంటే ఆమడ దూరంలో ఉండే పార్టీ బిఆర్ఎస్ అని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు వెలగల దుర్గయ్య,పోతిగంటి ప్రసాద్, మాజీ కో ఆప్షన్ నెంబర్ ఎండి కాజా,మాజీ పిఎసిఎస్ చైర్మన్ ఉడుముల బాల్ రెడ్డి,మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కాటం మల్లేశం,కాంగ్రెస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షులు మంచాల చిరంజీవిలు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బుట్టి యాదగిరి,ఎర్ర మైసగళ్ల గణేష్,తుమ్మ కుమార్,కోరే శ్రీశైలం,తుమ్మ శ్రీనివాస్, రాంబాబు,ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు,ప్రజలు,పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంలోనెరవేరుతున్న పేదోడి సొంతింటి కల



మనప్రజాప్రతినిధి// దినపత్రిక,తరిగొప్పుల, జనగామ:జనగామ నియోజకవర్గం.జనగామ నియోజకవర్గ ఇన్చార్జ్ కొమ్మూరి ప్రతాపరెడ్డి,ఆదివారం రోజున తరిగొప్పుల మండల అధ్యక్షులు వగలబోయిన యాదగిరి గౌడ్,ఆధ్వర్యంలో తరిగొప్పుల మండల కేంద్రంలోని నర్సాపూర్, గ్రామ శాఖ అధ్యక్షులు ఇరుముళ్ల సమ్మయ్య మరియు గ్రామ సర్పంచ్ కొండ్ర తార కుమార్,అబ్దుల్ నాగారం గ్రామ శాఖ అధ్యక్షులు,ముత్త సాంబరాజు మరియు గ్రామ సర్పంచ్ కావటి సుధాకర్ అధ్యక్షతన,ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించడం జరిగినది,అనంతరం నర్సాపూర్ గ్రామంలో ఇటీవల కాలంలో కారు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు మరణించినటువంటి విషయాన్ని తెలుసుకొని వారిని వారి కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగినది.అదేవిధంగా నరసాపూర్ గ్రామ శాఖ అధ్యక్షులు సమ్మయ్య,కుమారుని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని వారి కుటుంబానికి తగు ఆర్థిక సహాయం చేస్తానని హామీ ఇవ్వడం జరిగినది.ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా వ్యవసాయ కమిటీ చైర్మన్ బనక శివరాజ్ యాదవ్,కొమరవెల్లి దేవస్థానం ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ గంగం నరసింహారెడ్డి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,యువజన నాయకులు,జిల్లా నాయకులు తదితరులు పాల్గొనడం జరిగినది.

# కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం



మనప్రజాప్రతినిధి//చేగుంట ఏప్రిల్ 26:నార్సింగి మండలం జప్తి శివనూర్ నూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త ఎండి మున్వర్ ఇటీవల ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మరణించడం జరిగింది,ఇట్టి విషయం తెలుసుకున్న మెదక్ జిల్లా బిఅర్ఎస్ పార్టీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికీ ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మండలం తాజా మాజీ జడ్పిటిసి బాణాపురం కృష్ణారెడ్డి , శంకరంపేట మాజీ జెడ్పిటిసి పట్లోళ్ల మాధవి రాజు , నార్సింగి సర్పంచ్ ఆకుల మల్లేశం గౌడ్, జప్తి శివనూర్ సర్పంచ్ కాబోజి బాల నరసింహులు , మాజీ వైస్ ఎంపీపీ సుజాత శంకర్, ఉప సర్పంచ్ గంగమైన రాములు, షేర్ పల్లి గ్రామ సర్పంచ్ గోండ స్వామి, పార్టీ కార్యకర్తలు మాజీ సర్పంచులు వార్డ్ నెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వాసవి మాత జయంతి వేడుకలు



మనప్రజాప్రతినిధి//చేగుంట ఏప్రిల్ 26: చేగుంట పట్టణ కేంద్రంలో శ్రీ వాసవీ మాత జయంతి సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కన్యక పరమేశ్వరి దేవాలయం లో నిర్వహించిన కుంకుమ అర్చన కార్యక్రమం భక్తిశ్రద్ధల నడుమ అత్యంత వైభవంగా జరిగాయిఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అలంకరణలు, పుష్పాభిషేకాలు, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు అయిత పరంజ్యోతి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, జిల్లా, మండల ప్రజలందరికీ, సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని కోరుకున్నారు. సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వం పెరగాలని, ప్రతి కుటుంబం ఆనందంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తుడుపునూరి నాగేష్ గుప్తా, రాజేశ్వర్ గుప్తా,చంద్రమౌళి గుప్తా, బాలేశం గుప్తా, రాములు, శంకర్,నాయకులు తదితరులు పాల్గొన్నారు

# కుటుంబ సభ్యులను పరామర్శించిన శానంపూడి సైదిరెడ్డి



**-కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గంజి చంద్రమౌళికి నివాళి**

**-కుటుంబ సభ్యులను పరామర్శించిన శానంపూడి సైదిరెడ్డి**

**-హుజూర్ నగర్**

మనప్రజాప్రతినిధి//హుజూర్ నగర్:హుజూర్ నగర్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంజి చంద్రమౌళి గారు ఇటీవల అనారోగ్యంతో అకాలమరణం చెందిన విషయం తెలిసి హుజూర్నగర్ మాజీ ఎమ్మెల్యే మరియు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ శానంపూడి సైదిరెడ్డి వారి నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మృతుడి కుమారుడు గంజి శివతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా సైదిరెడ్డి మాట్లాడుతూ చంద్రమౌళి గారు ప్రజాసేవలో ముందుండే నాయకుడిగా అందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఆయన మరణం నియోజకవర్గానికి తీరని లోటని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొని చంద్రమౌళి గారికి నివాళులు అర్పించారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మనప్రజాప్రతినిధి//హుజూర్ నగర్: హుజూర్నగర్ పట్టణ పరిధిలోని కరక్కాయల గూడెం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు అందరూ 20 సంవత్సరాల తర్వాత మళ్లీ కలిసి వారి తీపి జ్ఞాపకాలను మాట్లాడుతూ చాలా సంతోషంగా హ్యాపీగా గడిపినారు విద్యార్థులు అందరూ కలిసి ఆటపాటలతో ఆనందంగా గడిపినారు ఈకార్యక్రమం అంకతి అప్పయ్యగారి మామిడి తోటలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించుకున్నారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు గన్న కవిత కీత కృష్ణవేణి సరస్వతి చంద్రకళ రమాదేవి సుజాత అంజమ్మ రమా రజిని కృష్ణ.వెంకటేశ్వర్లు ఎస్.కె అబ్దుల్ సత్తార్ రవి సుధాకర్ పి నరసింహారావు పురుషోత్తం జి నాగేశ్వరరావు జానకిరామయ్య టి శ్రీను ఏ వెంకటేశ్వర్లు సైదులు ఆంజనేయులు పిచ్చయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# పౌల్ట్రీ ఫార్మ్ దుర్వాసన నుండి గ్రామాన్ని కాపాడండి



మనప్రజాప్రతినిధి//చేగుంట ఏప్రిల్ 26,: పౌల్ట్రీ ఫార్మ్ దుర్వాస నుండి గ్రామాన్ని కాపాడాలంటూ చేగుంట మండలం పెద్ద శివనూర్ గ్రామస్తులు, ఆదివారం, పౌల్ట్రీ ఫామ్ ముందు నిరసన వ్యక్తం చేశారు, ఈ సందర్భంగా గ్రామస్థులు మీడియా తో మాట్లాడుతూ, పెద్దశివనూర్ గ్రామానికి 70మీటర్ సమీపంలో పౌల్ట్రీ ఫారం ఉన్నదని దాని కెపాసిటీ 1,50,000 ( ఒక లక్ష యాభై వేలు )లేయర్ కోళ్ళు దని , అది గ్రామానికి అతి సమీపంలో 13 షేడ్స్ ఒకే స్థలంలో ఉండటం వలన) గ్రామంలో దుర్గంధ వాసన వస్తుందని, తాండ నుండి గ్రామానికి వచ్చే రహదారి పైన చనిపోయిన కోళ్లు పడేయడం వల్ల , అక్కడ ఉన్న వీధి కుక్కలు వాటిని తిని, అక్కడ నుండి పాఠశాలకు వచ్చే విద్యార్థుల పైన కరిచిన సందర్భాలు చాలా ఉన్నహి అని అన్నారు,విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పంచాయతీ సెక్రటరీ ప్రశాంతికి ప్రతిరోజూ ప్రజలు పిర్యాదు చేస్తున్నందున,ఇట్టి విషయాన్ని పంచాయతీ సెక్రటరీ ద్వారా తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వారికి బోర్డు నియమనిబంధనల మేరకు పౌల్ట్రీ ఫాంపై తగిన చర్య తీసుకొని,ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని లేఖ ద్వారా తెలపటం జరిగిందని తెలిపారు . ఇప్పటికైనా అధికారులు స్పందించి, పౌల్ట్రీ ఫార్మ్ నుంచి వచ్చే దుర్వాసన నుండి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు

# కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లోకి పిల్లుట్ల రఘు!



మనప్రజాప్రతినిధి//హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ రాజకీయాల్లో ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. నియోజక వర్గంలో గట్టి పట్టున్న యువనేత, ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘు తన అనుచర గణంతో కలిసి గులాబీ కండువా కప్పుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆయనకు పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. నియోజకవర్గ సమీకరణాల్లో మార్పులు స్థానికంగా ప్రభావం కలిగిన నాయకుడు గత అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి, నియోజకవర్గంలో బలమైన ఓటు బ్యాంకును సంపాదించుకున్న పిల్లుట్ల రఘు ఇప్పుడు భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) గూటికి చేరడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. యువత అండ...రఘు బలం ఫౌండేషన్ ద్వారా వేలాది మంది నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, సామాజిక సేవా కార్యక్రమాలతో పిల్లుట్ల రఘు యువతలో విపరీతమైన క్రేజ్ సంపాదించుకున్నారు. ఆయన చేరికతో హుజూర్‌నగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.



# వధూవరులను ఆశీర్వదించిన బీ.డీ.ఎస్ ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దబ్బెట ఆనంద్



మనప్రజాప్రతినిధి//దుబ్బాక:నాయకుల సమక్షంలో సందడిగా జరిగిన వివాహ వేడుకజిల్లా సిద్ధిపేట మం,దుబ్బాక గ్రామం,దుంపనపల్లి గోపని భానుచందర్ రేఖ గారి వివాహ వేడుక ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగింది ఈ శుభకార్యానికి దీణాఖీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు దబ్బెట ఆనంద్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ఎర్ర కృష్ణ ముఖ్య అతిథిగా హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వారి రాకతో వివాహ వేడుకకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. ఎక్స్ సర్పంచ్ గోపని లక్ష్మి మల్లయ్య వెంకటాపూర్ గ్రామ దుంపల పల్లి గ్రామ ప్రజల మధ్య సంప్రదాయ పద్ధతిలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. వివాహ వేడుకకు హాజరైన బీడీ ఎస్ ఏఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దబ్బెట ఆనంద్ ఆయనతో వచ్చిన నాయకులు నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎర్ర సుధాకర్ , ట్రేడ్ యూనియన్ దబ్బేట భగవాన్ ,దాసు, ప్రభాకర్, రాజు ,చంద్రం, తరిగొప్పుల ఎల్లం, టీచర్ లింగం, తోట్ల రవీందర్, పులి చంద్రం, బచ్చిగాని రవి, సడిమెల లిఖిత్ కుంచం యాదగిరి తదితరులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. అలాగే గ్రామ పెద్దలు, పార్టీ కార్యకర్తలు, బంధువులు పెద్ద సంఖ్యలో హాజరై కొత్త దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. వివాహ వేడుకలో సాంప్రదాయ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించగా, గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొని వేడుకను మరింత వైభవంగా తీర్చిదిద్దారు. వధూవరులకు అందరూ ఆశీస్సులు అందిస్తూ వారి జీవిత ప్రయాణం ఆనందంగా సాగాలని కోరుకున్నారు